రైతుకు భరోసా ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి...

మెయింటెనెన్స్ కింద సంవత్సరానికి రూ.4,200 చొప్పున పామాయిల్ రైతులకు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిలిపివేసిందని తెలిపారు. వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని, డ్రిప్ కంపెనీలకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విధంగా మొక్కల కోసం ఇచ్చే సబ్సిడీని విడుదల చేయాలని కోరారు. పామాయిల్‌కు కస్టమ్ డ్యూటీని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరవాలి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాలని హరీశ్‌రావు హితవు పలికారు. రైతులు పండించిన అన్నిరకాల వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున పంట బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోనస్‌పై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, రైతులను దగా చేయవద్దని కోరారు. అక్కెనపల్లిలో పామాయిల్ రైతులు మొదటి మొక్కను తనతోనే నాటించారని, మొదటి గెలను కూడా తనతోనే తీయించడం సంతోషంగా ఉన్నదని హరీశ్‌రావు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు లింగంగౌడ్, ఎడ్ల సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కిష్టారెడ్డి, సారయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించండి

- ఖర్గేకు పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : టీపీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాల్సిందిగా పీసీసీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు విజ్ఞప్తి చేస్తూ ఆదివారం లేఖ రాశారు. 1971 నుంచి యువజన కాంగ్రెస్, కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో సేవలందిస్తూ ప్రస్తుతం టీపీసీసీలో సీనియర్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ సమన్వయ కమిటీ చైర్మన్‌గా ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసినట్టు పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గానికి (మున్నూరుకాపు) చెందిన తనకు టీపీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాల్సిందిగా కోరారు.

జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రావులపల్లి కృష్ణప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 9: జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రావులపల్లి కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్ కిరణ్ ఆదేశాల మేరకు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కదిరె రాము నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రావులపల్లి మాట్లాడుతూ, బీసీల ఐక్యత, బీసీ సమస్యల పరిష్కారం, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

చేపా చేపా.. చెరువుకు తొవ్వేది?

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఈ శాఖకు మంత్రి కూడా లేరు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఈ శాఖ ఉంది. ఈ నేపథ్యంలో ఏ అంశమైనా సీఎం దృష్టికి తీసుకెళ్లలేక అధికారులు ఇబ్బంది పడుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడేందుకు అధికారులకు మార్గం దొరకడం లేదు. దీంతో ఇప్పటికే రెండుసార్లు పథకం అమలుకు ప్రభుత్వానికి మత్స్యశాఖ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. గతేడాది పంపిణీకి సంబంధించిన బిల్లులను కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. సుమారు రూ. 104 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీంతో గతేడాది చేప పిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల కోసం ప్రభుత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇదిలా ఉంటే చేపల పంపిణీలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపల పంపిణీ పథకం అమలుపై ఆసక్తిగా లేనట్టు తెలిసింది.

5 లక్షల కుటుంబాలకు ఉపాధి దూరం..

ఒకవేళ ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని నిలిపిస్తే 5 లక్షల మత్స్యకార కుటుంబాలు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 6వేల మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 3.75 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీళ్లంతా కేసీఆర్ ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంతో జీవనోపాధి పొందుతున్నారు. ఈ పథకం ద్వారా సుమారు 23 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయినట్టు అంచనా. వీటి అమ్మకం ద్వారా కనీసంగా రూ. 32వేల కోట్ల సంపద సృష్టి జరిగింది. తద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమయ్యారు.

ఉత్పత్తి బంద్.. మళ్లీ దిగుమతులు

చేపల పంపిణీ పథకంతో రాష్ట్రంలో సమృద్ధిగా చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. కేసీఆర్ సర్కారు ఉచిత చేపల పంపిణీ ప్రారంభించడానికి ముందు అంటే 2016-17లో రాష్ట్రంలో కేవలం 2 లక్షల టన్నుల చేపలు మాత్రమే ఉత్పత్తి అయ్యేవి. అది ఇప్పుడు 4.38 లక్షల టన్నులకు పెరిగింది. ఈ విధంగా గడిచిన ఏడేండ్లలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి సుమారు 125 శాతం పెరగడం గమనార్హం. దీంతో రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ పుష్కలంగా చేపలు లభించాయి. వర్షాకాలంలో అయితే మత్తళ్లు దుంకినప్పుడు చేపల వరద పారింది. గతంలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ఏపీ నుంచి దిగుమతి చేసుకునే వాళ్లు. కానీ చేపల పంపిణీతో ఏపీ నుంచి చేపల దిగుమతి పూర్తిగా బంద్ అయింది. ఇంకా రాష్ట్రం నుంచి ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగింది. ఇలాంటి పరిస్థితుల్లో చేపల పంపిణీ పథకాన్ని నిలిపిస్తే మళ్లీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో చేపల ధరలు పెరిగి వినియోగదారులపైనా ప్రభావం చేపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రొయ్యి పిల్లల పంపిణీ, ఖర్చు

సంవత్సరం	చేసిన ఖర్చు	రొయ్యల సంఖ్య
2017-18	1.38	1.08
2018-19	6.27	3.19
2019-20	6.39	3.42
2020-21	8.61	4.01
2021-22	20.85	8.01
2022-23	21.23	8.62
2023-24	10.00	25.99
మొత్తం	74.73	54.33

సంవత్సరం వారిగా చేప పిల్లల పంపిణీ, చేసిన ఖర్చు

సంవత్సరం	నీటి వనరులు	చేప పిల్లల సంఖ్య	చేసిన ఖర్చు	ఉత్పత్తి	విలువ
2016-17	3939	27.85	22.46	1.99	2252.20
2017-18	11067	51.08	44.60	2.70	2855.10
2018-19	10776	49.15	42.95	2.94	3957.35
2019-20	15715	64.08	46.63	3.10	5012.20
2020-21	18335	68.52	51.80	3.49	5229.20
2021-22	23263	76.75	77.49	3.90	5859.99
2022-23	23748	76.70	63.00	4.38	6656.27
2023-24	26357	85.60	84.13	-	-
మొత్తం	-	499.73	433.06	22.5	31,822.31

నోట్: చేప పిల్లల సంఖ్య- కోట్లలో, ఖర్చు రూ. కోట్లు, ఉత్పత్తి- లక్షల టన్నులు, విలువ- రూ. కోట్లు

ఆర్ఆర్ఆర్‌కు రుణబంధం!

మొదటిపేజీ తరువాయి...

సంసిద్ధత వ్యక్తం చేయడంతోపాటు వివిధ జిల్లాల్లో భూములను గుర్తించింది. అలాగే, సేకరించిన భూమికిగాను రాష్ట్ర వాటా కింద చెల్లించాల్సిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల అథారిటీకి చెల్లించాల్సి ఉంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిధుల వేటలో పడింది. రోడ్డు నిర్మాణానికి రుణం ఇస్తాం కానీ భూ సేకరణ కోసం రుణం ఇచ్చే అవకాశం లేదని బ్యాంకులు స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హడ్కో నుంచి రుణం సేకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, హడ్కో నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 8000కోట్లు కోరగా, అందులో రూ. 3000కోట్లు ఇప్పటికే మంజూరు చేసింది. తాజాగా ఆర్ఆర్ఆర్‌కు కూడా రుణం కావాలని ప్రభుత్వం కోరుతున్నది. దీనిపై హడ్కో ఏ విధంగా స్పందిస్తుందనేది తెలియాల్సివుంది.

కోర్టు కేసుతో నిలిచిన ఉత్తర భాగం భూసేకరణ

వాస్తవానికి భూసేకరణకు అయ్యే మొత్తం ఖర్చును ఒకేసారి చెల్లించాలని జాతీయ రహదారుల అథారిటీ కోరినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున దశలవారీగా చెల్లిస్తామని అధికారులు తెలిపారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో దశలవారీగా చెల్లించేందుకు కేంద్రం సమ్మతించింది. దీంతో ముందుగా ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే సుమారు రెండున్నర వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉత్తర భాగంలో దాదాపు 80శాతం వరకూ భూసేకరణ పూర్తి కావడంతో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తే టెండర్ల ప్రక్రియ చేపట్టే అవకాశం కలుగుతుంది. అలాగే, మిగిలిన 20శాతం భూసేకరణ కూడా త్వరితగతిన చేపట్టాల్సి ఉంటుంది. అయితే, రాయగిరి ప్రాంతంలో రైతులు భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించంతో కోర్టు స్టే విధించింది. దీంతో అక్కడ భూసేకరణను నిలిపివేశారు. ప్రస్తుతం అక్కడ భూసేకరణ చేయాలంటే రైతులను ఒప్పించడమో లేక అలైన్‌మెంటులో స్వల్పంగా మార్పులు చేయడమో చేయాల్సివుంది.

ఉత్తర భాగం కొలిక్కొచ్చాకే దక్షిణ భాగం

ఉత్తర భాగం పనులకు టెండర్ల ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చాకే దక్షిణ భాగం పనులకు శ్రీకారం చుట్టే అవకాశముంది. దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసిన అధికారులు, త్వరలోనే దాన్ని కేంద్రానికి సమర్పించనున్నారు. అయితే, ఉత్తర భాగం పనులను భారత్ మాతా పరియోజనలో భాగంగా మంజూరు చేయగా, దక్షిణ భాగం పనులను వికసిత్ భారత్ ప్రాజెక్టు కింద చేపట్టే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే, భారత్‌మాతా పరియోజన కార్యక్రమంలో ఇప్పటికే పెద్ద ఎత్తున రోడ్డు ప్రాజెక్టులు చేపట్టినందున దక్షిణ భాగం పనులు అందులో చేపట్టే వీలు లేదని వారు పేర్కొంటున్నారు. దక్షిణ భాగం అలైన్‌మెంటు ఖరారైతే అనంతరం భూసేకరణ ప్రక్రియను చేపడతారు.

ప్యాకేజ్డ్ ఫుడ్‌లో చక్కెర 10 శాతమే ఉండాలి

- ఎనర్జీ ఫుడ్‌లో 10-30 శాతానికి పెరగొద్దు
- తాజాగా జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, బీవరేజీల్లో ఉండే షుగర్ పరిమాణంపై జాతీయ పోషకాహార సంస్థ స్పష్టమైన సూచనలు చేసింది. ఘన పదార్థాల్లో షుగర్ కంటెంట్ 10 శాతానికి మించకూడదని నిర్దేశించింది. ఇటీవల ఆహారం- పానియాల్లో (ఫుడ్, బేవరేజీ) పరిమితికి మించి చక్కెర కంటెంట్ ఉండటం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి, నియంత్రించేలా ఆహార నియామావళిని రూపొందించింది. మారుతున్న జీవనశైలి, ఆహార పదార్థాల ఆధారంగా దశాబ్దకాలంగా ఉన్న ఆహార మార్గదర్శకాలను ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ ఇటీవల పోషకాహార నియామావళిని అప్‌డేట్ చేసింది. ఆహారంలో అధిక చక్కెర వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడంతోపాటు నియంత్రణకు కూడా స్పష్టమైన సూచనలు చేసింది. ఇటీవల ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్, బీవరేజీల వినియోగం పెరిగినందున ఘన ఆహారాల్లో 5-10 శాతానికి మించి యాడెడ్ షుగర్ ఉండకూడదని సూచించింది. బీవరేజీల్లో ఉండే మొత్తంలో ఎనర్జీలో 10-30 శాతానికి మించి యాడెడ్ షుగర్ ఉండకూడదని పేర్కొన్నది. తాజాగా రూపొందించిన డైటరీ గైడ్ లైన్స్ ఆధారంగా ప్రముఖ ప్యాకేజ్డ్ ఫుడ్‌ను నియంత్రించేలా వీటి ద్వారా శరీరంలో చేరుతున్న చక్కెర పరిమాణాన్ని తగ్గించుకొనేలా నిర్దేశించింది. ఈ సూచనలతో ప్యాకేజ్డ్ ఫుడ్ తయారీ సంస్థలు కూడా ఆహార పదార్థాలను రూపొందించుకోనున్నాయి. ఇప్పటికే హార్లిక్స్, బూస్ట్, బోర్న్‌విటా వంటి పొడర్లను హెల్దీ డ్రింక్ జాబితా నుంచి తొలగించింది. బోర్న్‌విటా గతేడాదిలోనే షుగర్ కంటెంట్‌ను తగ్గించింది.

ఫుడ్ లేబుల్స్ అవగాహన

తయారీ సంస్థలు తప్పనిసరిగా ప్యాకేజింగ్ కవర్లపై ఫుడ్ లేబుల్స్‌ను ప్రచురించాలనే మార్గదర్శకాలు ఉన్నాయి. కానీ, వాటిపై వినియోగదారులకు అవగాహన తక్కువే. ఈ నేపథ్యంలోనే ఫుడ్ లేబుల్స్‌పై ఆహార పదార్థాల వివరాలను చూడాలని, వీటి ఆధారంగానే తినేందుకు ఎంపిక చేసుకోనేలా అవగాహన పెంచుతుంది. ఇప్పటికే లేబుల్స్‌పై చదివాలని ఆహార నిపుణులు కూడా సూచిస్తున్నారు.

గ్రామాల్లోనూ పరిశ్రమలు

మొదటిపేజీ తరువాయి...

తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో ఆదివారం అమెరికాలోని అట్లాంటాలో జరిగిన బిజినెస్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఐటీతోపాటు ఇతర పరిశ్రమల సుస్థిరాభివృద్ధి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా పారిశ్రామికరంగాన్ని బలోపేతం చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సెమీకండక్టర్, మెడికల్ డివైజ్ పరిశ్రమల అభివృద్ధికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటునకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సెమీ కండక్టర్ల పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏఐ నగరం ఏర్పాటునకు ప్రభుత్వం 200ఎకరాలు కేటాయించినట్టు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే ఏఐ సదస్సులో పాల్గొనాలని అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులను మంత్రి ఆహ్వానించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటునకు ఎన్నారైలు, పెట్టుబడిదారులు ముందుకు రావాలని విజ్ఞప్తిచేశారు. వారికి కావాల్సిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాల్లో అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత అభివృద్ధి కోసం మెరుగైన ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నట్టు మంత్రి చెప్పారు.

సెల్‌ఫోన్ కోసం బావిలోకి దిగి..

చేదబావిలో పడ్డ సెల్‌ఫోన్ తీసుకునేందుకు బావిలోకి దిగిన ఓ మహిళ.. పైకి ఎక్కుతుండగా మధ్యలో తాడు తెగి బావిలో పడిపోయింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆదివారం జరిగింది. బద్దిపోచమ్మ వీధిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న కూర రాజమణి సెల్‌ఫోన్ ఆదివారం చేదబావిలో పడిపోయింది. బావిలో నీళ్లు లేకపోవడంతో ఆమె చేపలు పట్టే వలను తాడుగా మలుచుకొని బావిలోకి దిగింది. ఫోన్ తీసుకుని పైకి వస్తుండగా తాడు తెగి ఆమె బావిలో పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని ఆమెను బయటకు తీశారు. రెండు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. -వేములవాడ

మనిషి మెదడుతో కంప్యూటర్!

మొదటిపేజీ తరువాయి...

సృష్టించారు. అందుకే, రెండింటి పేర్లు కలిసేలా దీనికి బ్రెయినోవేర్ అనే పేరు పెట్టారు.

ముందుగా శాస్త్రవేత్తలు మానవ మెదడులోని మూలకణాలను తీసుకొని ల్యాబ్‌లో వాటితో న్యూరాన్ల తరహా లక్షణాలను కలిగి ఉండే ఆర్గనాయిడ్లను తయారుచేసి ఉపయోగించారు. ఇది సాధారణ కంప్యూటర్ చిప్ లాగానే సిగ్నల్స్‌ను పంపించడం, అందుకోవడం చేయగలదు. అయితే, మానవ మెదడులోని న్యూరాన్లు దాదాపు 80 ఏండ్లు జీవించి ఉంటాయి. కానీ, వీటిలోని న్యూరాన్లు మాత్రం 100 రోజులే జీవించి మృతి చెందుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. వీటి స్థానంలో కొత్త వాటిని రీప్లేస్ చేయనున్నట్టు చెప్పారు.

విద్యుత్తు సమస్యకు చెక్!

ప్రస్తుతం వినియోగిస్తున్న డిజిటల్ ప్రాసెసర్లతో పోలిస్తే దాదాపు 10 లక్షల రెట్లు తక్కువ విద్యుత్తును ఉపయోగించుకోవడం దీని ప్రత్యేకత. ఏఐ డాటా సెంటర్లు ఎక్కువ విద్యుత్తు వినియోగిస్తున్న నేపథ్యం లో, తమ కొత్త సాంకేతికతతో విద్యు త్తు వినియోగాన్ని తగ్గించేలా ప్రయోగాలు చేపడతామని ఫైనల్‌స్పార్క్ సహ సీఈవో డాక్టర్ ఫ్రెడ్ జార్డన్ తెలిపారు.

పోలీసుల డేటా హ్యాకర్ అరెస్టు

- ఆధార్ డేటా చోరీ కేసులోనూ నిందితుడు
- ఢిల్లీలో అరెస్టుచేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- నిందితునికి సహకరించిన వారి కోసం గాలింపు
- టీఎస్‌కాప్ డేటా లీక్ కాలేదు.. భద్రంగానే ఉంది
- భవిష్యత్తులో పటిష్ఠ చర్యలు: డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ఇటీవల పోలీసు డేటా వ్యవస్థలపై దాడి చేసి, కొంత డేటాను లీక్ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్టు డీజీపీ రవిగుప్తా ఆదివారం వెల్లడించారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాకు చెందిన 20 ఏండ్ల విద్యార్థి జతిన్‌కుమార్ అని తెలిపారు. తెలంగాణ పోలీసు వ్యవస్థలో కీలకమైన హాక్ ఐ, టీఎస్‌కాప్, ఎస్ఎంఎస్ వ్యవస్థల్లోకి అక్రమంగా చొరబడి కొంత సమాచారాన్ని తోటి హ్యాకర్లతో కలిసి జతిన్‌కుమార్ దొంగిలించినట్టుగా చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డేటా లీక్ ఆధారాలతో ఢిల్లీకి వెళ్లి మరీ శనివారం నిందితుడు జతిన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. తెలంగాణ పోలీసు వ్యవస్థకు చెందిన కొంత డేటాను పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లో పోస్టు చేసింది జతిన్‌కుమార్ అని నిర్ధారించుకున్న తర్వాతే అతన్ని అరెస్టు చేశామని తెలిపారు. డేటా చోరీకి సంబంధించిన వివరాలను databreachforum.stలో పోస్ట్ చేశాడని, చోరీ డేటాను 150 డాలర్లకు అమ్మకానికి పెట్టాడని చెప్పారు. ఆసక్తి గల కొనుగోలుదారులు వరుసగా హాక్ ఐ, టీఎస్‌కాప్ డేటాకు సంబంధించి తనను సంప్రదించాలంటూ టెలిగ్రామ్‌లో Adm1nfr1end, Adm1nfr1ends అనే ఐడీలు క్రియేట్ చేసి పోస్టు చేసినట్టు గుర్తించామని తెలిపారు. తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసి, తన కోసం వెతుకుతున్నారని తెలుసుకున్న నిందితుడు తన గుర్తింపును దాచిపెట్టే ప్రయత్నం చేశాడని, అయినా సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను ఉపయోగించి ఢిల్లీలో అరెస్టు చేశామని తెలిపారు. అతన్ని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్టు డీజీపీ చెప్పారు. నిందితుడు జతిన్‌కుమార్‌కు గతంలోనూ పలు డేటా చోరీలకు పాల్పడిన చరిత్ర ఉన్నదని తెలిపారు. నిరుడు సంచలనం సృష్టించిన ఆధార్ డేటా లీక్ కేసులో జతిన్‌కుమార్ కీలక హ్యాకర్‌గా వ్యవహరించాడని, దీంతోపాటు వివిధ ఏజెన్సీలకు సంబంధించిన కీలక సమాచారాన్ని హ్యాక్ చేయడంలోనూ కీలకంగా వ్యవహరించాడని తెలిపారు. జతిన్‌కుమార్‌కు సహకారం అందించిన తోటి హ్యాకర్లను కూడా అరెస్టు చేస్తామని డీజీజీ స్పష్టం చేశారు.

డేటా లీక్ కాలేదు.. భద్రంగానే ఉంది

జతిన్‌కుమార్ దొంగిలించిన తెలంగాణ పోలీసు వ్యవస్థల డేటా భద్రంగానే ఉన్నదని డీజీపీ రవిగుప్తా తెలిపారు. బలహీనమైన పాస్‌వర్డ్‌ల కారణంగా 'హాక్ ఐ'లోని కొన్ని విభాగాలకు చెందిన డేటాను మాత్రమే యాక్సెస్ చేసి ఉండొచ్చని డీజీపీ వివరణ ఇచ్చారు. 'టీఎస్‌కాప్' యాప్‌లోని సమాచారం సేఫ్‌గా ఉన్నదని, థర్డ్ పార్టీకి డేటాను అమ్మారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఎస్ఎంఎస్ సర్వర్‌లోకి సైబర్ నేరగాళ్లు చొరబడ్డట్టు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తమని పేర్కొన్నారు. హ్యాకింగ్‌పై భద్రతాపరమైన లోపాలు ఉన్నాయోమోనని పరిక్షిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి హ్యాక్‌ల నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు వివరణ ఇచ్చారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయెల్ పర్యవేక్షణలో తక్కువ సమయంలో నిందితున్ని అరెస్టు చేసిన ఎస్పీలు భాస్కరన్, విశ్వజిత్ కంపాటి, డీఎస్పీలు కేవీఎం ప్రసాద్, ఏ సంపత్, ఇన్‌స్పెక్టర్ ఆశిశ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌ను డీజీపీ అభినందించారు.

మాతృభాషల్లోనూ 'నీట్'గా రాసేస్తున్నారు

- ఆరేండ్లుగా పలు భాషల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- గుజరాతీ, బెంగాలీ, తమిళంలోనే అధికం

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): మాతృభాషల్లోనూ నిర్వహిస్తున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు విద్యార్థుల నుంచి స్పందన పెరుగుతుంది. ముఖ్యంగా గుజరాతీ, బెంగాలీ, తమిళభాషల్లో అత్యధికులు నీట్‌ను రాస్తున్నారు. 2019 నుంచి ఇంగ్లిష్, హిందీతో పాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, మలయాళం, ఒడియా, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లోనూ నీట్‌ను నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి బెంగాలీలో రాసేవారి సంఖ్య పదింతలు పెరిగింది. హిందీలో రాసేవారి సంఖ్య రెట్టింపైంది. గుజరాతీలో 58వేల మంది రాశారు. తమిళంలో 2019లో కేవలం వెయ్యి మంది మాత్రమే రాయగా, ఈఏడాది ఏకంగా 36వేల పైచిలుకు విద్యార్థులు రాశారు. 2019లో తెలుగులో 700 మంది ఉంటే ఈఏడాది 1,684 మంది హాజరయ్యారు. మాతృభాషాభిమానం అధికంగా ఉండే తమిళులు తమ భాషలో రాసేందుకు ఇష్టపడుతున్నారు.

మనోళ్లు అంతంతే..

తెలుగులో నీట్ రాసేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడంలేదు. 2019 నుంచి 2024 వరకు ఏటా రెండువేలు దాటడంలేదు. తెలుగుతో పాటు ఉర్దూ ఒడియా, పంజాబీ, మలయాళం, కన్నడ, మరాఠీ భాష ల్లో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఇంగ్లిష్ మీడియంలో చదివిన వారే ఎక్కువుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మనోళ్లు ప్రాంతీయభాషలపై ఆసక్తి చూపించడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరేండ్లుగా ప్రాంతీయభాషల్లో నీట్ రాస్తున్న వారి వివరాలు

భాష	2019	2020	2021	2022	2023	2024
ఇంగ్లిష్	12,04,968	12,63,273	12,65,520	14,76,024	16,72,914	18,92,355
హిందీ	1,79,857	2,04,399	2,28,641	2,58,827	2,76,180	3,57,908
అస్సామీ	1,796	5,328	4,596	4,063	3,324	3,769
బెంగాలీ	4,750	36,593	35,110	42,663	43,890	48,265
గుజరాతీ	59,395	59,055	49,942	49,638	53,027	58,836
కన్నడ	2,305	1,005	963	1,193	704	1,065
మరాఠీ	31,239	6,258	2,913	2,368	1,833	1,759
మలయాళం	00	00	3,031	1,510	1,003	958
ఒడియా	31,490	822	1,016	822	988	1,312
పంజాబీ	00	00	104	96	73	214
తమిళం	1,017	17,101	19,868	31,965	30,536	36,333
తెలుగు	700	1,624	1,251	1,264	1,295	1,684
ఉర్దూ	1,858	1,977	1,822	1,910	1,695	1,545

బైరాన్‌పల్లిలో జైన చౌముఖి శిల్పం

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో జైన చౌముఖి శిల్పం లభించినట్టు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని అంగడి వీరన్న ఆలయం సమీపంలో విగ్రహం ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు దీన్ని వెలికితీశారు. 10వ శతాబ్దానికి చెందిన చాళుక్యుల కాలం నాటి సర్వతోభద్ర విగ్రహంగా చరిత్రకారులు గుర్తించారు. - మద్దూరు (ధూళిమిట్ట)

పక్కాగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

హైదరాబాద్, జూన్ 9 (నమస్తేతెలంగాణ) : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి దరి సంయుక్తంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో వారు సమావేశమై, పలు కీలక నిర్ణయాలు తీసుకొన్నారు. ఇరు రాష్ట్రాల అడవుల సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణ అంశాలపై చర్చించారు. ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్‌ల ప్రాంతాల్లో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయం అందించాలని చెప్పారు. సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ (సీడబ్ల్యుడబ్ల్యు) ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్ నుండి రెండు బృందాల అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో తొక్కించి కానిస్టేబుల్ హత్య

లక్నో, జూన్ 9: ఉత్తరప్రదేశ్‌లో ఇసుక మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. తమను అడ్డుకున్న పోలీసులపైకి దాడులకు తెగబడుతున్నారు. నవాబ్‌గంజ్ ప్రాంతంలో ఓ పోలీస్ కానిస్టేబుల్ (24)ను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేశారు. ఇసుక అక్రమ రవాణా సాగుతుందన్న సమాచారం అందుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోశ్‌కుమార్, కానిస్టేబుల్ చమన్, రోహిత్ కుమార్‌లు శనివారం రాత్రి నాగ్లా చందన్‌కు వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న కొంతమందిని అడ్డుకొని పోలీసులు ప్రశ్నిస్తుండగా, డ్రైవర్ హఠాత్తుగా వారిపైకి ట్రాక్టర్‌ను పోనిచ్చాడు. తీవ్రంగా గాయపడ్డ రోహిత్ కుమార్‌ను సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించామని, అయితే ఆదివారం అతడు మరణించాడని జిల్లా ఎస్పీ వికాస్‌కుమార్ తెలిపారు. ఈ దాడి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించామని, త్వరలో వారిని అరెస్టు చేస్తామని అన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

మల్లేశం (ఫైల్)

పాపన్నపేట, జూన్ 9: సాగు అప్పులు తీర్చలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కొత్తపల్లిలో జరిగింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లేశం (38) పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వనగండ్ల వానకు పంట దెబ్బతింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. ఈ క్రమంలో మే 30న పొలం వద్దకు వెళ్లి అక్కడ పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మెదక్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.